## ‘సర్’లో విధులు నిర్వహించే ఈఆర్ఓ, ఏఈఆర్ఓలకు

# ప్రత్యేక వేతనం ఇవ్వండి

### తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్‌ను కోరిన డీసీఏ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి



**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(సెన్సిటీవ్ ఇంటెన్సీ రివిజన్–ఎస్ఐఆర్)లో విధులు నిర్వహిస్తున్న ఓటరు నమోదు అధికారులు(ఈఆర్ఓ), సహాయ ఓటరు నమోదు అధికారు(ఏఈఆర్ఓ)లకు ఒక నెల వేతనం ఇవ్వాలని తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్‌ను డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి కోరారు. తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డిని శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) నేతలు కలిసి భారత ఎన్నికల సంఘం సవరించిన దాని ప్రకారం బీఎల్ఓ, సూపర్‌వైజర్లకు పారితోషికం, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలకు గౌరవ వేతనాల అమలుపై చర్చించారు. ఇదే కాకుండా సర్‌లో విధులు నిర్వహించే ఈఆర్ఓ, ఏఈఆర్ఓలకు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఇచ్చినట్టుగానే ఒక నెల ప్రత్యేక వేతనం కూడా ఇవ్వాలని కోరారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి బీఎల్ఓలు, సూపర్వైజర్లకు చెల్లించవలసిన పారితోషికం తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు అందలేదన్నారు. భారత ఎన్నికల సంఘం సవరించిన దాని ప్రకారం పారితోషికం బీఎల్ఓలకు రూ. 12వేలు, బీఎల్ఓ సూపర్వైజర్లకు రూ.18వేలు, ఏఈఆర్ఓ లకు రూ.25వేలు, ఈఆర్ఓలకు రూ.30 వేల చొప్పున చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలోనూ, ఓటరు జాబితాకు సంబంధించిన ఇతర సందర్భాలలో పని చేస్తున్న బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు భారత ఎన్నికల సంఘం పారితోషికం (రెన్యూ మరేషన్) పెంచిందన్నారు. అదే సమయం లో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలకు సైతం రెన్యూమ రేషన్ పెంచుతూ ప్రతిపాదనలు చేసిందన్నారు. భారత ఎన్నికల సంఘం సవరించిన రేట్ల ప్రకారం పారితోషికం, గౌరవ వేతనాల చెల్లింపునకు అవసరమైన బడ్జెట్ కేటాయించ వలసిందిగా కోరారు. దీనిపై సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా త్వరలోనే అన్ని అంశాలపై సానుకూల నిర్ణయం వస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా అధ్యక్షురాలు రాధా, ప్రధాన కార్యదర్శి హేమమాలిని, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.